సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శుక్రవారం । 30 । మే । 2025



సర్కారు వారి ఆయిల్‌బామ్!

ఏక వార్షిక పంటల సాగులో విపత్తుల వల్ల రైతులు నష్టపోతే పరిహారం ఇవ్వాల్సి వస్తోంది. దీనిని తప్పించుకునేందుకు ప్రభుత్వం బహు వార్షిక పంటల సాగును తెరపైకి తెచ్చింది.


8లో



లారీ డ్రైవర్ హల్‌చల్

జగ్గంపేట పోలీసు స్టేషన్ వద్ద మద్యం తాగిన ఒక డ్రైవర్ గాజుముక్కతో శరీరాన్ని కోసుకుంటూ రక్తం ఓడుతుండగా పోలీసులను తిడుతూ గురువారం రాత్రి నానా హంగామా సృష్టించాడు.

కడలిలోకి 10,719 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం 10,719 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.30 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు నీటిని విడుదల చేయలేదు.

న్యూస్‌రీల్

వాడపల్లి వెంకన్నకు రూ.1.32 కోట్ల రాబడి



హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

కొత్తపేట: కోనసీమ తిరుమలగా ఖ్యాతికెక్కిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి ఆలయ హుండీల ద్వారా రూ1.32 కోట్ల ఆదాయం సమకూరింది. దేవదాయ, ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఈ విషయం తెలిపారు. ఆలయంలోని హుండీలను 31 రోజుల అనంతరం గురువారం తెరచి, వసంత మండపంలో లెక్కించారు. ప్రధాన హుండీల ద్వారా రూ.1,11,60,745, అన్నప్రసాదం హుండీల ద్వారా రూ.20,43,431 ఆదాయం వచ్చిందని ఈఓ వివరించారు. ఒక భక్తురాలి నిలువు దోపిడీ ద్వారా 104 గ్రాములు, మిగతా భక్తులు సమర్పించినది 8 గ్రాములు కలిపి మొత్తం 112 గ్రాముల బంగారం, 980 గ్రాముల వెండి, 64 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చాయని తెలిపారు. గురువారం ఒక్క రోజే వివిధ సేవలు ద్వారా రూ.3,77,057 ఆదాయం వచ్చిందని చక్రధరరావు పేర్కొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



సీహెచ్ గున్నేపల్లిలో సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు

ముమ్మిడివరం: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 31న ముమ్మిడివరం, కాట్రేనికోన మండలాల్లో చేపట్టనున్న పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ గురువారం పరిశీలించారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, ప్రాంతీయ ఇంటెలిజెన్స్ అధికారి కృష్ణారావు, ఇతర జిల్లా అధికారులతో కలసి అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ పర్యటన చేపట్టారు. సీహెచ్ గున్నేపల్లిలో సత్తెమ్మ గుడి ఎదురుగా ఏర్పాటు చేసిన హెలిపాడ్‌ను, చెయ్యేరులో ఉపాధి హామీ పథకం ద్వారా సుమారు రూ.9.88 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను, సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ వేదిక ఏర్పాట్లను, చెయ్యేరు జెడ్పీ హైస్కూల్ వెనుక ఏర్పాటు చేసిన ప్రజా వేదికను, సీహెచ్ గున్నేపల్లిలో సత్తెమ్మ తల్లి గుడి పక్కన పార్టీ శ్రేణుల సమావేశ స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఆర్డీఓలు డి.అఖిల, ఎ.మాధవి, డ్వామా పీడీ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు. చంద్రబాబు ఢిల్లీ నుంచి శనివారం మధ్యాహ్నం 12.25 గంటలకు రాజమహేంద్రవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో 12.50 గంటలకు సీహెచ్ గున్నేపల్లి చేరుకుని, చెరువు పూడికతీత పనులను పరిశీలిస్తారు. అనంతరం పీ–4 బంగారు కుటుంబాలను మార్గదర్శకులకు దత్తత ఇచ్చే కార్యక్రమం చేపట్టి, పింఛన్లు పంపిణీ చేస్తారు. గ్రామస్తులతో ముఖాముఖి, పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహిస్తారు.

డీలర్లు నిబంధనలు పాటించాలి



ఉదయ భాస్కర్

అమలాపురం రూరల్: నిబంధనలకు లోబడి డీలర్లు వినియోగదారులకు రేషన్ సరకులు సరఫరా చేయాలని జిల్లా పౌర సరఫరాల అధికారి అడపా ఉదయ భాస్కర్ ఆదేశించారు. వచ్చే నెల 1 నుంచి ప్రజాపంపిణీ విధానం ద్వారా నిత్యావసర వస్తువులను చౌక దుకాణాల ద్వారానే పంపిణీ చేస్తామన్నారు. ప్రతి నెల 1 నుంచి 15వ తేదీ వరకూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకూ, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకూ రేషన్ షాపులు తెరచి ఉంచాలని డీలర్లను ఆదేశించారు. దుకాణాల పని వేళలు, ధరలు, సరకుల నిల్వను సూచించే బోర్డు షాపు ముందు భాగంలో తప్పనిసరిగా ప్రదర్శించాలన్నారు. 65 సంవత్సరాలు పైబడిన వారికి, దివ్యాంగులకు ఇళ్లవద్దనే రేషన్ పంపిణీ చేయాలన్నారు. ఈ–పోస్, వేయింగ్ మెషీన్లు కండిషన్‌లో ఉంచుకోవాలని, కార్డుదారులందరికీ కచ్చితమైన కొలతలు, తూకంతో నిత్యావసర వస్తువులు పంపిణీ చేసి, రశీదు ఇవ్వాలని ఆదేశించారు. రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పుల కోసం ప్రభుత్వం ఆన్‌లైన్ విధానం తీసుకుని వచ్చిందని డీఎస్‌ఓ తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఈ మార్పులు చేసుకోవచ్చన్నారు. కొత్త బియ్యం కార్డు, కార్డు విభజన, సాధారణ విభజన, వితంతువు విభజన, విడాకుల విభజన, సింగిల్ మెంబర్ స్ప్లిట్, కొత్త సభ్యుల చేరిక, ఉన్నవారి తొలగింపు, తప్పు ఆధార్ సీడింగ్, చిరునామా మార్పు, కార్డు సరెండర్ వంటివి చేసుకోవచ్చని ఉదయ భాస్కర్ వివరించారు.

పల్లె.. కళ తప్పింది

- గత ప్రభుత్వ హయాంలో నెలకో సంక్షేమ పథకం
- ఇప్పుడు పింఛన్‌తో సరి
- నేడు వెలవెలబోతున్న సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ సెంటర్లు
- గత ప్రభుత్వ హయాంలో 789 భవనాలకు శ్రీకారం
- రూ.229.89 కోట్ల అంచనాతో నిర్మాణాలు
- 508 భవనాల నిర్మాణాలు పూర్తి
- కూటమి హయాంలో నిలిచిపోయిన నిర్మాణాలు

సరిగ్గా ఏడాది కిందట.. ఇంటింటికీ **వచ్చి** సేవలందించే వలంటీర్లు.. ప్రభుత్వ **పరంగా** అవసరమైన పనిని చిటికెలో చేసి **పెట్టే సచి**వాలయ ఉద్యోగులు.. ఉన్న ఊళ్లో**నే వైద్యం** .. గుమ్మం ముంగిట్లోనే అందే రేష**న్.. విత్తు** నుంచి పంట కొనుగోళ్ల వరకూ అ**న్నదా**తలకు అడుగడుగునా అండగా ని**లిచిన** రైతుభరోసా కేంద్రాలు (ఆర్‌బీకే).. **నాడు – నేడు**తో కొత్త రూపునద్దుకున్న పాఠ**శాల**లు.. ప్రతి నెలా అందే ఏదో ఒక సం**క్షేమ** పథకంతో పల్లెలన్నీ సందడిగా ఉండేవి. మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాకారమైన రోజులు నాటి వైఎస్సార్ సీపీ పాలనలో కనిపించేవి. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిన తర్వాత ఏడాది కాలంగా సంక్షేమ పథకాల ఊసే లేదు. వీధుల్లో వలంటీర్ల సందడీ కనుమరుగైంది. సచివాలయ ఉద్యోగులకు సర్వేల భారం, సర్దుబాటు భయం తప్ప.. సంక్షేమం అందించే పరిస్థితే లేకుండా పోయింది. రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చుకున్న ఆర్‌బీకేలు నిర్వీర్యమయ్యాయి. పల్లె ముంగిట్లో ప్రభుత్వ వైద్య సేవలు నిలిచిపోయాయి. ఇంటింటికీ రేషన్ ఆపేశారు. ఫలితంగా నేడు పల్లెలు కళ తప్పి కనిపిస్తున్నాయి.

– సాక్షి, అమలాపురం

నాడు గ్రామ స్వరాజ్యానికి పెద్ద పీట

గత ప్రభుత్వ పాలనలో గ్రామ స్వరాజ్యానికి పెద్ద పీట వేశారు. కులం, మతం, రాజకీయం అనే వివక్ష లేకుండా.. ఎక్కడా అవినీతికి తావు లేకుండా.. అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు నేరుగా అందించారు. వలంటీర్ల ద్వారా లబ్ధిదారులను వెతికి మరీ గుర్తించి, సంక్షేమ లబ్ధి చేకూర్చారు. ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించారు. వారి ద్వారా ప్రభుత్వ పథకాలన్నీ గడప వద్దకే వచ్చేవి. దీనికి సమాంతరంగా పల్లెల్లో అభివృద్ధిని కూడా పరుగులు పెట్టించారు. గతంలో ఊళ్లో ఒక ప్రభుత్వ భవనం ఉంటే గొప్ప. కానీ నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామ సచివాలయం, ఇంగ్లిష్ మీడియం విద్య, నాడు – నేడుతో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా మారిన ప్రభుత్వ బడి, ఆర్‌బీకే, విలేజ్ క్లినిక్.. ఇలా కనీసం రూ.కోటి విలువైన భవనాలు ప్రతి గ్రామంలోనూ సమకూరాయి.



నాడు: కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేసిన పి.గన్నవరం జెడ్పీ ఉన్నత పాఠశాల



నాడు: ఉప్పలగుప్తం మండలం భీమనపల్లి పంచాయతీ సూదాపాలెం వద్ద ఒకేచోట నిర్మించిన సచివాలయం-2, ఆర్‌బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్



నేడు: అంబాజీపేట మండలం మాచవరం పంచాయతీ కొర్లపాటివారిపాలెంలో నిలిచిపోయిన ఆర్‌కేబీ, హెల్త్ సెంటర్ భవన నిర్మాణాలు

ప్రభుత్వ భవన నిర్మాణాలకు బ్రేక్

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

జిల్లావ్యాప్తంగా 789 గ్రామ, వార్డు సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ సెంటర్ల నిర్మాణాలకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యాన రూ.229.89 కోట్లతో ఈ పనులకు శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వ హయాంలోనే సుమారు రూ.156.06 కోట్లతో 508 భవనాల నిర్మాణాలు (సుమారు 64.38 శాతం) పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత 27 భవనాల నిర్మాణ పనులు మాత్రమే జరుగుతున్నాయి. అవి కూడా నత్తను తలపిస్తున్నాయి. 244 భవనాల నిర్మాణ పనులు ఇంకా మొదలు కాలేదు. 10 భవన నిర్మాణాల పనులు వివిధ కారణాలతో అనుమతుల దశలోనే ఆపేశారు. కొన్ని భవనాల పనులను పునాది దశలోనే నిలిపివేశారు. కూటమి ప్రభుత్వ తీరు చూస్తుంటే ఈ వ్యవస్థలను క్రమంగా ఎత్తేస్తారనే అనుమానం ప్రజల్లో కలుగుతోంది.

ఎక్కడి నిర్మాణాలు అక్కడే..



నాడు: రావులపాలెం మండలం గోపాలపురంలో సచివాలయం

జిల్లాలో 384 సచివాలయాలు నిర్మించాలని **ప్రభుత్వం లక్ష్య**ంగా పెట్టుకుంది. రూ.140.52 **కోట్లు అంచనాతో** ఈ పనులు మొదలు పెట్టింది. **గత వైఎస్సార్** సీపీ ప్రభుత్వ హయాంలోనే **రూ.78.89 కోట్లతో** 278 సచివాలయాల **నిర్మాణాలు పూర్త**య్యాయి. 10 భవనాలు నిర్మాణ **దశలో ఉండగా..** కూటమి ప్రభుత్వం వచ్చిన తరు**వాత ఈ పనులు** దాదాపు నిలిచిపోయాయి. ఇంకా **96 భవనాల ని**ర్మాణ పనులు పూర్తి కావాల్సి ఉంది. **ప్రస్తుత ప్రభుత్వ** హయాంలో ఈ పనులు మొద**లవుతాయనే న**మ్మకం స్థానికులకు కలగడం లేదు.



నేడు: రావులపాడులో అడుగు ముందుకు పడని సచివాలయ భవనం

కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు



కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామ సచివాలయాలు పూర్తిగా పని చేయడం లేదు. ప్రజలకు ప్రభుత్వం నుంచి అందాల్సిన ధ్రువీకరణ పత్రాలను వలంటీర్లు స్వయంగా అందించేవారు. సంక్షేమ పథకాలు ప్రతి ఒక్క లబ్ధిదారునికి అందేవి. ఇప్పుడా రోజులు లేవు. ఇప్పుడు జనం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది.

– షేక్ అహ్మద్ అలీషా, ద్రాక్షారామ, రామచంద్రపురం రూరల్

సక్రమంగా అందని సేవలు



గ్రామ సచివాలయంలో సేవలు సక్రమంగా అందడం లేదు. ఆర్‌బీకేల ద్వారా అమ్మిన ధాన్యానికి డబ్బులు పడటం లేదు. రబీలో ధాన్యం అంతా అమ్ముకున్న తరువాత మద్దతు ధర కొద్దిమేర పెంచారు. రైతు సేవా కేంద్రాలు నిరుపయోగంగా మారాయి.

– ఎన్.వెంకటేశ్వర్లు, పినపళ్ల, ఆలమూరు మండలం

వెబ్‌సైట్‌లు ఓపెన్ చేయాలి



గ్రామ సచివాలయాలు, వలంటీర్ల సేవలను కొనసాగించాలి. ప్రభుత్వం ఏర్పాటై ఏడాది అవుతున్నా ప్రజలకు ఎలాంటి పథకాలూ అందించకపోవడం దారుణం. రైస్ కార్డులతో పాటు పింఛన్ దరఖాస్తుల వెబ్‌సైట్లు ఓపెన్ చేసి, ప్రజలకు సేవలను అందించాలి.

– వాసంగి కుమారస్వామి, తొండవరం, అంబాజీపేట

72 ఆర్‌బీకేలు పూర్తయ్యేదెప్పుడో!

రైతులకు మేలు చేసే లక్ష్యంతో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్‌బీకేల నిర్మాణాలను కూడా కూటమి ప్రభుత్వం నిలిపివేసింది. మొత్తం రూ.56.49 కోట్లతో 247 ఆర్‌బీకేలు నిర్మించాలన్నది లక్ష్యం. 157 ఆర్‌బీకేల నిర్మాణ పనులు పూర్తవగా 8 నిర్మాణ దశలో ఉన్నాయి. 72 భవనాల పనులు ఇంతవరకూ మొదలు కాలేదు. రామచంద్రపురం మండలం ద్రాక్షారామలో భవనం పునాదుల్లోనే నిలిచిపోయింది. చెట్లు కూడా మొలుస్తున్నాయి. ఇదొక్కటి చాలు ఆర్‌బీకేలను ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యం చేస్తోందో చెప్పడానికి.



నాడు: కొత్తపేట మండలం వాడపల్లిలో నిర్మించిన ఆర్‌బీకే



నేడు రామచంద్రపురం మండలం ద్రాక్షారామలో పునాది స్థాయిలోనే నిలిచిపోయిన ఆర్‌బీకే-2 భవనం

హెల్త్ సెంటర్లకు సుస్తీ

గ్రామీణ వైద్యానికి పెద్ద పీట వేసేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జిల్లాలో 158 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీనికి రూ.30.57 కోట్లు కేటాయించింది. రూ.28.55 కోట్లతో 73 క్లినిక్‌ల నిర్మాణం పూర్తవగా 9 క్లినిక్‌లు నిర్మాణ దశలో ఉన్నాయి. ఇంకా 76 నిర్మించాల్సి ఉంది. అమలాపురం కామనగరువులో హెల్త్ క్లినిక్ నిర్మాణ పనులు కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మొత్తం నిలిచిపోయాయి. వీటిని పూర్తి చేసే పరిస్థితి లేదనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.



వైఎస్సార్ హెల్త్ క్లినిక్: ఉప్పలగుప్తం మండలం నంగవరంలో వైఎస్సార్‌సీ విలేజ్ హెల్త్ క్లినిక్



విలేజ్ హెల్త్ క్లినిక్: సఖినేటిపల్లి మండలం మోరిపోడులో పునాది స్థాయిలో నిలిచిన హెల్త్ వెల్‌నెస్ భవనం

పల్లె కన్నీరు పెడుతోంది

సంక్షేమ పథకాలు లేక ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గిపోతోంది. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌కు ఎగనామం పెట్టింది. ఒక్క పథకం కూడా అమలు చేయలేదు. మత్స్యకారులకు ఇస్తానన్న సొమ్ము ఒక ఏడాది ఎగ్గొట్టింది. రెండో ఏడాది రూ.20 వేల చొప్పున అందించింది. అందులో కూడా ఎమ్మెల్యేల సిఫారసుల మేరకు సొంత పార్టీ వారికి మాత్రమే పెద్ద పీట వేశారు. వ్యవసాయం దెబ్బ తింది. కొబ్బరి తప్ప వరి, ఆక్వా, కోకో ఇలా ప్రతి పంటా రైతులకు నష్టాలను మిగిల్చింది. అన్నదాత సుఖీభవ నిధులివ్వలేదు. పరిహారం ఊసేలేదు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు నెలల పాటు జీతాల్లేవు. ఉపాధి కూలీలకు సైతం జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకూ రూ.50 కోట్ల వరకూ వేతనాల బకాయిలున్నాయి. అమ్మ ఒడి సొమ్ము ఇవ్వడం లేదు. ఇలా ఏ ఒక్క పథకం అందకపోవడంతో పేదలు, మధ్యతరగతి వారి వద్ద నగదు చలామణీ తగ్గిపోతోంది. ఫలితంగా పల్లెల్లోని కిరాణా, వస్త్ర, ఫ్యాన్సీ దుకాణాల్లో అమ్మకాలు పడిపోతున్నాయి. సామాన్యులే కాదు.. మధ్యతరగతి వారు కూడా ఖర్చుతో కూడిన పనులంటే భయపడిపోతున్నారు.

బదిలీలకు 8,836 మంది ఉపాధ్యాయుల దరఖాస్తు

రాయవరం: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా బదిలీల కోసం 8,836 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. కంపల్సరీ దరఖాస్తులతో పాటు, ఇష్టపూర్వకంగా ఉన్న వారు కూడా దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు 245, పీఎస్ హెచ్‌ఎంలు 215, ఎల్‌పీ హిందీ 41, ఎల్‌పీ సంస్కృతం 3, ఎల్‌పీ తెలుగు 93, ఎల్‌పీ ఉర్దూ 3, పీఈటీలు 42, ఎస్‌ఏ తెలుగు 524 మంది, ఎస్‌ఏ ఇంగ్లిష్ 729, ఎస్‌ఏ హిందీ 396, ఎస్‌ఏ సంస్కృతం 9, ఎస్‌ఏ ఉర్దూ 2, ఎస్‌ఏ బయలాజికల్ సైన్స్ 479, ఎస్‌ఏ గణితం 873, ఎస్‌ఏ ఫిజికల్ సైన్స్ 615, ఎస్‌ఏ సోషల్ స్టడీస్ 471, ఎస్‌ఏ ఫిజికల్ డైరెక్టర్ 260, ఎస్‌ఏ స్పెషల్ ఎడ్యుకేషన్ 10, సెకండరీ గ్రేడ్ టీచర్లు 3,826 మంది ఉన్నారు.



పదోన్నతుల కోసం నిరీక్షిస్తున్న ఉపాధ్యాయులు

పదోన్నతులకు ఉపాధ్యాయుల నిరీక్షణ.. రాత్రి 7 దాటినా నిర్వహించని వైనం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): స్కూల్ అసిస్టెంట్లకు గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు కల్పించడానికి చేపట్టిన కౌన్సెలింగ్ గురువారం రాత్రి ఏడు గంటలు దాటినా ప్రారంభం కాలేదు. దీంతో, ఉపాధ్యాయులు కౌన్సెలింగ్ కేంద్రం వద్దనే గంటల తరబడి పడిగాపులు పడ్డారు. పదోన్నతుల కౌన్సెలింగ్‌కు ఉదయం 9 గంటలకే స్థానిక సాలిపేట బాలికల ఉన్నత పాఠశాలకు రావాలని సమాచారం ఇవ్వడంతో అందరూ ఉదయమే అక్కడకు చేరుకున్నారు. షెడ్యూల్ ప్రకారం బుధవారం ఈ కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉండగా ఆప్షన్ల నమోదులో జాప్యం చోటు చేసుకుంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 96 మంది జిల్లా పరిషత్, 16 మంది ప్రభుత్వ, ఏడుగురు మున్సిపల్ పాఠశాలలల్లో ఉద్యోగోన్నతి పొందనున్నారు. తీవ్ర ఆలస్యంగా ప్రారంభమైన ఈ కౌన్సెలింగ్ రాత్రి సుమారు 10 గంటల సమయానికి పూర్తయ్యింది.

అయ్యో.. అసలే వద్దంటారా..!

- పంపాలో స్నానాలు వద్దంటున్న దేవస్థానం
- యువకుడి మృతితో చర్యలు
- అప్రమత్తం చేసే బదులు ఇదేం పని?
- ఘాట్‌లలో రక్షణ ఏర్పాట్లు చేయాలని భక్తుల విన్నపం

అన్నవరం: భద్రాచలం సీతారామచంద్ర స్వామివారి దర్శనానికి వెళ్లిన వారు గోదావరిలో స్నానం చేయకూడదని బోర్డులు ఏర్పాటు చేసి, సెక్యూరిటీ గార్డులను కాపలా పెడితే ఎలా ఉంటుంది? అన్నవరం పంపా జలాశయం వద్ద ఇటువంటి పరిస్థితే భక్తులకు ఎదురవుతోంది. పంపా జలాశయంలో శ్రీచక్ర స్నానం గొయ్యిలో మునిగిపోయి బుధవారం ఒక యువకుడు మృతి చెందిన విషయం విదితమే. అక్కడ గొయ్యి ఉందని తెలియక, పెద్దగా లోతుండదని భావించి వెళ్లిన అతడు ఆ గోతిలో పడి మృతి చెందాడు. అక్కడ దేవస్థానం అధికారులు ఎటువంటి హెచ్చరిక బోర్డులూ ఏర్పాటు చేయలేదు. కనీసం ఆ గొయ్యి చుట్టూ మెష్ ఏర్పాటు చేసి, కర్రలు పాతి, జెండాలు అమర్చినా గొయ్యి ఉందనే విషయం అందరికీ తెలిసి ఉండేది. అటువంటి చర్యలేవీ తీసుకోకపోవడంతో ఓ యువకుడి నిండు ప్రాణాలు బలయ్యాయి. ఈ విషాద సంఘటనతో మేల్కొన్న అధికారులు విచిత్రమైన చర్య తీసుకున్నారు. 'గేట్లు దాటి లోపలకు వెళ్లేందుకు ప్రవేశం లేదు' అంటూ అధికారులు పంపా గేట్లకు గురువారం ఫ్లెక్సీలు తగిలించారు. అలాగే, నది వద్ద 'ఇచ్చట నీటిలో దిగుట ప్రమాదకరం' అని బోర్డు ఏర్పాటు చేశారు. అలాగే, పంపాలో స్నానం చేయడం నిషిద్ధమని బోర్డులు పెట్టారు. దీంతో, పంపా జలాశయానికి స్నానం చేయడానికి వస్తున్న భక్తులు అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. పండగలు, కార్తిక మాసం వంటి పవిత్ర దినాల్లో పంపా నదిలో స్నానం చేసి, సత్యదేవుని దర్శించుకోవాలని చాలా మంది భక్తులు భావిస్తుంటారు. దేవస్థానం అధికారులు తగిన రక్షణ ఏర్పాట్లు చేయాలే తప్ప మొత్తానికే స్నానం చేయవద్దంటే ఎలాగని భక్తులు ప్రశ్నిస్తున్నారు.



'గేట్లు దాటి లోపలకు ప్రవేశం లేదు' అని పంపా స్నాన ఘట్టాల గేట్లకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

'నా భార్య పట్ల అసభ్యంగా ప్రవర్తించారు'

- ఏఈఓపై మరో ఆరోపణ
- సీఎంఓకు ఫిర్యాదు చేసిన భక్తుడు
- విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఈఓకు ఉన్నతాధికారుల ఆదేశం

అన్నవరం: ఏఈఓ కె.కొండలరావుపై మరోసారి ఆరోపణలు రావడం అన్నవరం దేవస్థానంలో కలకలం రేపింది. తెలంగాణలోని మంచిర్యాల నుంచి సత్యదేవుని సన్నిధిలో సేవ చేయడానికి వచ్చిన తమ పట్ల కొండలరావు దురుసుగా ప్రవర్తించారని మహిళా సేవకులు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీనిపై మండిపడిన దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ ఈ వ్యవహారంపై విచారణ జరిపి, నివేదిక సమర్పించాలని దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావును ఆదేశించారు. ఈ మేరకు కొండలరావుకు షోకాజ్ నోటీసు కూడా జారీ అయ్యింది. ఈ వివాదం ఇంకా ముగియక ముందే ఆయనపై మరో భక్తుడు తీవ్ర స్థాయి ఆరోపణలతో ఏకంగా ముఖ్యమంత్రి కార్యాలయానికి (సీఎంఓ) ఫిర్యాదు చేయడం సంచలనం రేపింది. ఆయన ఫిర్యాదు ప్రకారం..

ఏం జరిగిందంటే..

హైదరాబాద్‌కు చెందిన భక్తుడు హోతా కామేశ్వర శాస్త్రి ఈ నెల 13వ తేదీ రాత్రి జరిగిన సత్యదేవుని శ్రీపుష్పయాగం కార్యక్రమానికి అన్నవరం వచ్చారు. రూ.2 వేల టికెట్టుతో సత్యదేవుని వ్రతమాచరించి, స్వామివారిని దర్శించుకున్నారు. ఆ సందర్భంగా అక్కడి పురోహితుడు రాత్రి స్వామివారి శ్రీపుష్పయాగ మహోత్సవం జరుగుతుందని చెప్పడంతో కామేశ్వరశాస్త్రి దంపతులు హైదరాబాద్ ప్రయాణం రద్దు చేసుకున్నారు. సత్యదేవుని శ్రీపుష్పయాగానికి హాజరయ్యారు. ఈ ఉత్సవం ముగిసిన తరువాత ప్రసాదం తీసుకునేందుకు అర్చకుని వద్దకు వెళ్లగా, తెల్లని వస్త్రాలు ధరించిన వ్యక్తి తన భార్య భుజంపై చేయి వేసి తోసేశారని, అసభ్యంగా ప్రవర్తించారని ఆరోపించారు. దీంతో, తాను ఒక్కసారిగా షాక్‌కు గురయ్యానన్నారు. ఆ వ్యక్తి దేవస్థానం ఉద్యోగి కె.కొండలరావుగా అక్కడి సిబ్బంది ద్వారా తెలుసుకున్నానని పేర్కొన్నారు. వెంటనే కింద పడిపోయిన తన భార్యను లేవదీసి, ఈఓకు ఫిర్యాదు చేద్దామనుకున్నానన్నారు. అప్పటికే ఈఓ కొండ దిగువకు వెళ్లిపోయారని తెలిసి హైదరాబాద్ వచ్చేశామని పేర్కొన్నారు. తన భార్యతో పాటు ఇతర భక్తుల పట్ల అతడి ప్రవర్తన అదేవిధంగా ఉందని ఆ ఫిర్యాదులో కామేశ్వరశాస్త్రి పేర్కొన్నారు. ఆయనపై చర్య తీసుకోవాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు కాపీని దేవదాయ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి గురువారం దేవస్థానానికి పంపించి, దీనిపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఈఓను ఆదేశించారు. దీనిపై విచారణాధికారి ద్వారా విచారణ చేయించనున్నట్లు ఈఓ తెలిపారు.



సర్కారు వారి ఆయిల్‌బామ్!

- ప్రత్యేకంగా ఆయిల్‌పామ్ సాగుకు జిల్లాలకు టార్గెట్‌లు
- వరి, పట్టు వంటి పంటలకు ప్రత్యామ్నాయం అంటూ ప్రచారం
- రాయితీలు, నష్ట పరిహారాల భారం తగ్గించుకోవాలని సర్కారు ఎత్తుగడ
- రైతులను ఒప్పించే పనిలో నిమగ్నమైన అధికార యంత్రాంగం

పిఠాపురం: పంట చేతికందితే రైతుకు ఏటా ఆదాయం వస్తుంది. అది ఒక్క వార్షిక పంటలకే సాధ్యమవుతుంది. అదే బహు వార్షిక పంటలైతే పంట నాటిన కొన్నేళ్ల వరకు రైతుకు ఆదాయం రాదు. వార్షిక పంటలైతే ఏటా లాభాలతో పాటు నష్టాలు ఉంటాయి. అలా నష్టాలు వస్తే పరిహారం కోసం రైతు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాడు. రాయితీలు, నష్ట పరిహారాలు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఇలా ఒకటేమిటి అన్నీ ప్రభుత్వం రైతుకు కల్పించాల్సి ఉంటుంది. వీటితోడు సాగునీరు, విద్యుత్ వంటి సౌకర్యాలు కల్పించాలి. వరదలు వచ్చినా, వానలు వచ్చినా తెగుళ్లు విజృంభించినా రైతుకు నష్ట పరిహారం ఇవ్వక తప్పదు. ఇలాంటి బాధలు తప్పించుకోవడానికి, భారం తగ్గించుకోవడానికి కూటమి ప్రభుత్వం బహు వార్షిక పంటల సాగును తెరపైకి తెచ్చింది. దీని కోసం ప్రతి జిల్లాకు టార్గెట్‌లు నిర్ణయించింది. దీనిలో భాగంగా కాకినాడ జిల్లాకు 10 వేల ఎకరాల ఆయిల్‌పామ్ వంటి పంటలు సాగు చేయించాలని టార్గెట్ పెట్టారు. దీంతో అధికార యంత్రాంగం కార్యాచరణ ప్రారంభించింది. ఇటీవల పట్టు రైతులు తమకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని అడగడానికి వెళితే జిల్లా ఉన్నతాధికారులు నష్టం వచ్చే పంటలకు బదులు ఆయిల్ పామ్ వంటివి సాగు చేసుకోండి అని ఇచ్చిన సలహా ఇప్పుడు వరి, ఇతర వాణిజ్య పంటలు సాగు చేస్తున్న రైతులకు ఇస్తున్నారు. అగ్రికల్చర్, సెరీ కల్చర్, హార్టి కల్చర్‌కు జిల్లా అధికారులు లక్ష్యాలు నిర్ణయించడంతో ఆయా శాఖల అధికారులు ప్రస్తుతం రైతులను ఒప్పించే పనిలో బిజీగా మారారు. ముందుగా ఖాళీ భూములను గుర్తించి వాటిలో ఆయిల్‌పామ్ సాగు చేయాలని చెబుతున్నారు. ఇతర పంటలను సైతం నిలిపివేసి ఆయిల్‌పామ్ సాగు చేసుకుంటే మంచి లాభాలు వస్తాయని రైతులకు నచ్చజెబుతున్నారు. బహు వార్షిక పంటలను సాగు చేయమని చెబుతున్నామని అధికారులు అంటున్నప్పటికీ ఎక్కువ శాతం ఆయిల్‌పామ్‌ను ప్రోత్సహిస్తున్నారు.



ఆయిల్‌పామ్ తోట

ఆయిల్‌పామ్ లాభదాయకమేనా?

సాధారణంగా ఆయిల్‌పామ్ సాగు ఎక్కువగా మెట్ట ప్రాంతాల్లో నీటి వసతి తక్కువగా ఉన్న ఏరియాల్లో చేస్తుంటారు. నీటి వసతి ఉన్న అన్ని ప్రాంతాల్లోనూ వీటి సాగుకు రైతులు ముందుకు రారు. ఆయిల్‌పామ్ ఒక్కో ఏడాది మంచి లాభాలు ఇచ్చినా కొన్నేళ్ల పాటు తీవ్ర నష్టాలనే చూపించిందంటున్నారు రైతులు. గత ఐదేళ్లుగా టన్ను రూ.10 వేలు మాత్రమే ఉండడంతో పెట్టుబడి కూడా రాలేదని రైతు ఆందోళన వ్యక్తం చేసిన ఘటనలు ఉన్నాయి. గతంలో థాయిలాండ్ నుంచి పామాయిల్ దిగుమతి కావడం, అది తక్కువ రేటు ఉండడంతో ఇక్కడ ఆయిల్‌పామ్‌కు డిమాండ్ లేక పోయింది. దీంతో రేటు అమాంతం పడిపోయి జిల్లాలో ఉన్న ఒక పామాయిల్ కంపెనీ సైతం మూతపడినట్లు రైతులు చెబుతున్నారు. అలాంటిది ఈ ఏడాది థాయిలాండ్ నుంచి దిగుమతులు లేక ఇక్కడి వాటికి డిమాండ్ పెరిగి టన్ను రూ.21 వేలకు చేరడంతో ప్రస్తుతం లాభాలు వస్తున్నాయంటున్నారు. ఇలా ఒక్కో ఏడాది ఒక్కో మాదిరిగా డిమాండ్ ఉండే ఆయిల్‌పామ్‌ను లాభదాయక పంటగా అధికారులు చెబుతుండడంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆయిల్ పామ్ సాగు చేస్తే కనీసం నాలుగేళ్ల పాటు ఎటువంటి ఆదాయం ఉండదు. అంతర పంటలు సాగు చేసుకుంటే తప్ప ఆదాయం రాదదని రైతులు చెబుతున్నారు. అంతర పంటలు కూడా అంతగా ఆదాయాన్ని ఇవ్వవని, ఏ పంటా వీలు లేని పొలాల్లో మాత్రమే ఆయిల్‌పామ్‌కు ప్రాధాన్యం ఇస్తారని రైతులు చెబుతున్నారు. రైతు ఎలా ఉన్నా తమపై భారం పడకుండా, ఎప్పుడు పడితే అప్పుడు ప్రభుత్వంపై ఒత్తిడి తేకుండా ఉండాలన్న ఒకే ఒక్క ఆలోచనతో ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ప్రస్తుతం బహువార్షిక పంటల పేరుతో వరితో సహా ఇతర పంటల సాగును నిలిపివేయించి ఆయిల్‌పామ్ సాగును పెంచే పనిలో ప్రభుత్వం ఉన్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు.

> **నష్టాలు రాకుండా చూడాలనే..**
>
> **విచ్చల విడిగా రసాయనాలు వాడడం వల్ల పంటలు దెబ్బతిని రైతు తీవ్ర నష్టాల పాలవుతున్నారు. వారికి మేలు చేయడానికే ప్రభుత్వం బహు వార్షిక పంటలను వేసుకునేలా చర్యలు తీసుకుం**టోంది. ఆయిల్‌పామ్ వంటి పంటలకు ప్రభుత్వం రాయితీలు ఇస్తోంది. పంటల మార్పిడి జరిగితే రైతుకే మంచిది. అందువల్లే బహువార్షిక పంటల సాగుపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. దీనిని అమలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం.
>
> – చైత్రవర్షిణి, పాడా పీడీ, పిఠాపురం

కాకినాడ జిల్లాలో సాగు వివరాలు

వరి సాగు చేసే భూములు – 1.58 లక్షల ఎకరాలు
సాగు చేసే రైతులు – 1.45 లక్షల మంది
ఏటా ధాన్యం దిగుబడి – 5.70 లక్షల టన్నులు (ఒక పంటకు)
పట్టు సాగు చేస్తున్న మండలాలు – 19
పట్టు సాగు చేస్తున్న గ్రామాలు – 155
పట్టు సాగు చేస్తున్న రైతులు – 1,150 మంది
పట్టు సాగు చేస్తున్న భూమి –4,500 ఎకరాలు
పట్టుగూళ్ల దిగుబడి –రోజుకు 5 టన్నులు
వాణిజ్య పంటలు సాగు చేస్తున్న భూములు – 36,738 హెక్టార్లు
వాణిజ్య పంటలు సాగు చేస్తున్న రైతులు – సుమారు 40 వేల మంది
పామాయిల్ సాగవుతున్న భూములు – 12,679 హెక్టార్లు
పామాయిల్ సాగు చేస్తున్న రైతులు – సుమారు 10 వేల మంది

క్లుప్తంగా

సామర్లకోటలో బార్‌పై కేసు నమోదు



సామర్లకోట బార్‌లో ఎక్సైజ్ సీఐ తనిఖీలు

సాక్షి ఇంపాక్ట్

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న అశ్విన్ రెస్టారెంట్ అండ్ బార్‌పై కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ సీఐ కె. రామోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. సాక్షి దినపత్రికలో 'బార్ తెగించి అమ్మకాలు' అనే శీర్షికతో గురువారం ప్రచురితమైన కథనానికి స్పందించి కాకినాడ నార్త్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉదయాన్నే బార్‌లో అమ్మకాలు జరుపుతున్నట్లు గుర్తించి కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. ఆయనతోపాటు ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు. బార్‌ను ఉదయం 10 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు తెరచి ఉంచవలసి ఉండగా తెల్లవారు జాము నుంచీ బహిరంగంగా అమ్మకాలు చేస్తున్న విషయాన్ని 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది.

బాలికపై అత్యాచారం

పోక్సో కేసు నమోదు

కె.గంగవరం: ప్రేమించి పెళ్లి చేసుకుంటానని చెప్పి బాలికను మోసం చేసి, ఆనక ముఖం చాటేసిన యువకుడిపై కె.గంగవరం పోలీసులు కేసు నమోదు చేశారు. రామచంద్రపురం డీఎస్పీ బి.రఘువీర్ చెప్పిన వివరాల ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని పామర్రుకు చెందిన మందపల్లి సాగర్ అనే యువకుడు అదే పేటకు చెందిన బాలికతో సంబంధం ఏర్పరుచుకున్నాడు. ప్రస్తుతం బాలిక ఏడవ నెల గర్భవతిగా ఉంది. కొంతకాలంగా సాగర్‌ను పెళ్లి చేసుకోవాలని బాలిక అడుగుతుండడంతో ముఖం చాటేశాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు స్థానిక పెద్దలను ఆశ్రయించారు. అక్కడ ఫలితం లేక పోవడంతో కె.గంగవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై గురువారం డీఎస్పీ రఘువీర్, అమలాపురం మహిళా ఎస్సై గంగాభవాని, కె.గంగవరం ఎస్సై జానీబాషా పామర్రు గ్రామానికి వచ్చి విచారణ నిర్వహించి బాధితురాలు, వారి కుటుంబ సభ్యుల వద్ద నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ సదరు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశామని, ప్రస్తుతం యువకుడు పరారీలో ఉన్నాడని, దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

అనాథలైన ఇద్దరు చిన్నారులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెంకటాయపాలెం శివారు చీమలదిబ్బ గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కుయ్యేరు గ్రామానికి చెందిన శీలం కమల(43) మృతి చెందినట్టు ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ గురువారం విలేకరులకు తెలిపారు. శీలం కమల బుధవారం వెంకటాయపాలెంలోని పేపకాయల బాబ్జీ కల్యాణ మండపంలో జరుగుతున్న బంధువుల అమ్మాయి ఓణీల ఫంక్షన్‌కి కుటుంబీకులు, బంధువులతో కలసి 5 మోటారు సైకిళ్లపై బయలుదేరారు. మరొక 5 నిమిషాల్లో కల్యాణ మండపానికి చేరుకుంటారన్న సమయంలో ఈమె ప్రయాణిస్తున్న వాహనం గోతిలో పడటంతో వెనుక కూర్చున్న కమల జారి రోడ్డుపై పడిపోయారు. అదే సమయంలో ద్రాక్షారామ నుంచి కుయ్యేరు వైపుగా వెళ్తున్న కోళ్ల సరఫరా చేసే లారీ చక్రాలు ఆమె పైనుంచి వెళ్లిపోవడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. ఆమె భర్త సుమారు 2 సంవత్సరాలు క్రితం గుండెపోటుతో మృతి చెందారు. వీరి పెద్ద కుమార్తెకు వివాహం చేశారు. ఇంకా 9 ఏళ్ల కుమారుడు, 6 ఏళ్ల కుమార్తె ఆమెపై ఆధారపడి ఉన్నారు. ఆమె ద్రాక్షారామలో వస్త్ర దుకాణంలోలో పనిచేస్తూ పిల్లలను పోషించుకుంటోంది. ఆమె కుమారుడు చిన్నతనం నుంచీ కీళ్లవాతంతో బాధపడుతున్నాడు. కుమార్తెకు చిన్న వయస్సులోనే ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగింది, తల్లిదండ్రులు ఇద్దరినీ కోల్పోయిన ఆ చిన్నారుల పరిస్థితి తలచుకుని బంధువులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. ఆసుపత్రి సమాచారం, బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్సై లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



తన ఇద్దరు పిల్లలతో మృతురాలు కమల (ఫైల్)

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

గోపాలపురం: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోపాలపురం ఉప్పరగూడెం గ్రామానికి చెందిన తుంగా వంశీ (25) బుధవారం రాత్రి గోపాలపురం గ్రామ శివారు పొగాకు బోర్డు సమీపంలో ఉన్న వేప చెట్టుకు వేలాడుతూ మృతిచెంది ఉన్నాడు. విషయం తెలుసుకున్న వంశీ మేనమామ కూనపోం వెంకట్రావు వెళ్లి చూసి గురువారం గోపాలపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వంశీ తల్లి 10 సంవత్సరాల వయసులో మృతిచెందింది. తండ్రి వేరే పెళ్లి చేసుకుని వెళ్లపోవడంతో వంశీ, అతని అక్క వందన మేనమామ ఇంటి వద్ద ఉంటూ జీవనం సాగించారు. అయిదు సంవత్సరాల క్రితం అక్క వందన మలకపల్లి గ్రామానికి చెందిన వ్యక్తిని వివాహం చేసుకొని వెళ్లిపోయింది. దీంతో అతను తన మేనమామ వద్ద ఉంటూ కూలి పనులు చేస్తుండేవాడు. వంశీ చెడు వ్యసనాలకు బానిస కావడంతో మేనమామ పట్టించుకోవడం మానేశాడు. దీంతో ఒంటరి జీవితాన్ని గడప లేక మనస్తాపానికి గురైన వంశీ చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్టు భావిస్తున్నారు. మేనమామ వెంకట్రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద స్థితిలో మృతిగా కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై యెగ్గేపల్లి సత్యనారాయణ చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.



వంశీ (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి...

గండేపల్లి: హైవేపై ఆగి ఉన్న లారీని కారు ఢీకొన్న ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన వ్యక్తిని చికిత్సకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్టు గండేపల్లి ఎస్సై యూవీ శివ నాగ బాబు తెలిపారు. బుధవారం రాత్రి జరిగిన ఈ ప్రమాద వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఒడిశాకు చెందిన చంద్రశేఖర్ ప్రధాన్ (27), త్రిలోచన్ ప్రధాన్ పనుల కోసం కారులో ముంబయి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వీరి కారు మండలంలోని నీలాద్రిరావుపేట పరిధి చక్రవర్తినగర్ వద్ద రోడ్డుపై నిలిపిన కంటైనర్ లారీని వెనక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ పక్క సీట్లో ఉన్న చంద్రశేఖర్ ప్రధాన్ తీవ్రంగా గాయపడటంతో అతనిని చికిత్స నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు 108 అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందినట్టు పేర్కొన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేయనున్నట్టు తెలియజేశారు.



నీలాద్రిరావుపేటలో రోడ్డుపై నిలిచిన కంటైనర్‌ను వెనక నుంచి ఢీకొన్న కారు

విద్యుత్ షాక్‌తో...

పిఠాపురం: గొల్లప్రోలు మండలం ఏ విజయనగరంలో హెచ్‌డీ కరెంట్ పనులు చేస్తున్న కూలి గురువారం కరెంట్ షాక్‌తో మృతి చెందినట్లు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం అడ్డతీగల మండలం జీ కొత్తూరుకు చెందిన బూడిద మహేష్‌బాబు విద్యుత్ పనులు చేస్తుంటాడు. గురువారం గొల్లప్రోలు మండలం ఏ విజయనగరంలో హెచ్‌డీ కరెంట్ పనులు చేస్తూ విద్యుత్ స్తంభాన్ని పైకి లేపగా పైన ఉన్న విద్యుత్ వైర్లు తగిలి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. తీవ్ర గాయాలైన అతనిని పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి బంధువు బూడిద మరియ ఇచ్చిన ఫిర్యాదుపై గొల్లప్రోలు ఎస్సై ఎస్.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని వివాహిత..

పిఠాపురం: గొల్లప్రోలు మండలం కొడవలి పాత హరిజనపేటకు చెందిన నామా నాగమణి బుధవారం రాత్రి ఉరి వేసుకుని మృతి చెందినట్టు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం తన భర్తకు గల అనారోగ్య సమస్యలు, ఆర్థిక పరిస్థితుల కారణంగా ఆమె చనిపోవాలని నిర్ణయించుకుంది. గురువారం రాత్రి కొడవలిలో ఆమె అద్దెకు ఉంటున్న ఇంటిలో ఉరి వేసుకుని చనిపోయింది. ఈమెకు భర్త, కుమార్తె మౌనిక, కుమారుడు నిఖిల్ ఉన్నారు. మృతురాలి అక్క పుప్పాల సూర్యమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు ఎస్సై ఎస్.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ డ్రైవర్ హల్‌చల్

- మద్యం మత్తులో పోలీసులపై తిట్ల పురాణం
- సెల్‌ఫోను, నగదు తీసుకున్నారని ఆరోపణ

జగ్గంపేట: జగ్గంపేట పోలీసు స్టేషన్ వద్ద మద్యం తాగిన ఒక డ్రైవర్ గాజుముక్కతో శరీరాన్ని కోసుకుంటూ రక్తం ఓడుతుండగా పోలీసులను తిడుతూ గురువారం రాత్రి నానా హంగామా సృష్టించాడు. అతని వద్దకు వెళ్లడానికి స్థానికులు భయపడ్డారు. కొద్దిసేపటి తరువాత పోలీసులు అతన్ని పట్టుకుని ఆసుపత్రికి తరలించారు. గుర్రంపాలెం రోడ్డులో వున్న ఒక రైసు మిల్లు వద్ద రోడ్డుపై ఒక వ్యక్తి దుస్తులు విప్పేసి వచ్చి వెళ్లే వాహనాలను ఆపి ఇబ్బందులకు గురిచేస్తున్నాడని 100కి స్థానికులు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో జగ్గంపేట ఎస్సై రఘునాథరావు అక్కడకు కానిస్టేబుల్స్‌ను పంపారు.మద్యం మత్తులో హల్‌చల్ చేస్తున్న వ్యక్తిని పోలీసులు వారించినా అతను వినకపోవడంతో పోలీసులు అతని వద్ద వున్న సెల్‌ఫోన్ తీసుకున్నారు. మద్యం మత్తులో వున్న వ్యక్తి లారీ డ్రైవర్ అని, ఎక్కడి నుంచో స్థానిక రైసు మిల్లుకు లోడ్ తీసుకువచ్చినట్లు స్థానికులు చెప్పారు. సెల్‌ఫోన్ తీసుకోవడంతో మద్యం సేవించిన డ్రైవర్ పోలీసులను తిడుతూ, చచ్చిపోతానని బెదిరిస్తూ పోలీసు స్టేషన్ వద్దకు చేరుకున్నాడు. నా సెల్‌ఫోన్‌తో పాటు నా దగ్గర నగదు కూడా తీసుకున్నారని ఆరోపణలు చేశాడు. మీరు పోలీసులా రౌడీలా అంటూ కేకలు వేశాడు. అక్కడ దొరికిన బీరు బాటిల్ బద్దలు కొట్టి గాజుముక్కతో శరీరంపై గాట్లు పెట్టుకున్నాడు. దీంతో శరీరం రక్తంతో తడిసిపోయింది. గాజుముక్కతో బెదిరించడంతో ఎవరూ దగ్గరకు వెళ్లడానికి సాహసం చేయలేదు. కొద్దిసేపటి తరువాత పోలీసుల అతనిని పట్టుకుని ఆసుపత్రికి తరలించారు.



జగ్గంపేట పోలీసు స్టేషన్ వద్ద మద్యం మత్తులో హల్‌చల్ చేస్తున్న డ్రైవర్

ఉపాధి కరవై యువత ఆందోళన

ప్రకాశంనగర్ (రాజమహేంద్రవరం) : ఉపాధి లేకపోవడంతో యువత మానసికంగా ఆందోళనకు గురవుతున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం మధ్యాహ్నం స్థానిక అపరాల సెక్షన్ సీపీఐ శాఖలో జరిగిన బహిరంగ సభకు మధు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది డిగ్రీ, బీటెక్ పూర్తి చేసుకుని నిరుద్యోగ యువత ఉద్యోగాలు లేక, ఉపాధి లేక ఆకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ భృతి కల్పిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఇప్పటికీ ఎన్నికల హామీలను అమలు చేయకుండా యువతను మోసం చేస్తోందని విమర్శించారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండలరావు, సహాయ కార్యదర్శి సప్ప రమణ పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ బ్రిడ్జి నిర్మాణానికి స్థల పరిశీలన

నిడదవోలు : పట్టణంలో ఇందిరానగర్ నుంచి బసివిరెడ్డిపేట వెళ్లడానికి అనువైన ఫుట్‌పాత్ బ్రిడ్జి నిర్మాణం కోసం శుక్రవారం వివిధ ప్రాంతాల్లో రైల్వే, మున్సిపల్ అధికారులు పర్యటించారు. ఇందిరానగర్ నుంచి బసివిరెడ్డిపేట వెళ్లడానికి ప్రజలు రైల్వేట్రాక్ దాటవలసి వస్తోంది. అయితే ఇందిరా నగర్ వద్ద ఉన్న రైల్వేగోడకు ఉన్న మార్గాన్ని రైల్వే అధికారులు మూసివేసే ప్రక్రియను ప్రారంభించారు. దీంతో అక్కడి స్థానికులు గోడను మూయడానికి వీలు లేదని గతంలో అడ్డుకున్నారు. దీంతో అధికారులు గోడ మార్గాన్ని మూసివేసే పనులను తాత్కాలికంగా నిలిపివేశారు. ఫుట్‌పాత్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు రావడంతో విజయవాడ రైల్వే డివిజినల్ ఆపరేటింగ్ మేనేజర్ సోమశేఖర్‌నాయుడు తన సిబ్బందితో కలిసి ఫుట్‌పాత్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. పట్టణంలో చిన కాశిరేవు వద్ద కూడా మరో ఫుట్‌పాత్ బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి రైల్వే ఉన్నతాధికారులకు నివేదిస్తామని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి, నిడదవోలు రైల్వే ఐవోబీ అధికారి కిషోర్, టౌన్‌ప్లానింగ్ అధికారి సుప్రియ పాల్గొన్నారు.



ఫుట్‌పాత్ బ్రిడ్జి నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న రైల్వే అధికారులు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	22,500
గటగట (వెయ్యి)	20,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	21,500
గటగట (వెయ్యి)	19,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	14,500 – 15,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	14,500 – 15,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

తుని: రైలు ఢీకొని తుని–హంసవరం మధ్యలో గుర్తు తెలియని వ్యక్తి (70) మృతి చెందాడని జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. తుని – మండలం హంసవరం మధ్యలో గురువారం పట్టాలు దాటుతున్న వృద్ధుడిని గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి ఒంటిపై ఎరుపు రంగుపై పూల డిజైన్ కలిగిన లుంగీ, తెలుపు రంగు గడుల చొక్కా ఉన్నాయి. కేసు నమోదు చేసి మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించామని ఆయన తెలిపారు.

గ్రంథాలయ సంస్థ ఉద్యోగులకు బదిలీల కౌన్సెలింగ్

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులకు సాధారణ బదిలీల్లో భాగంగా గురువారం కాకినాడ కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జి రాహుల్‌మీనా కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులు బదిలీ దరఖాస్తులు పరిశీలించి ఐదు సంవత్సరాలు నిండిన ఉద్యోగులను, వివిధ కారణాలతో రిక్వెస్ట్ బదిలీలు కోరిన 15 మంది ఉద్యోగులను వారు ఎంచుకున్న ఆప్షన్ల ప్రకారం వివాదాలకు తావివ్వకుండా బదిలీ చేశామన్నారు. ఆయన బదిలీ ఉత్తర్వులు అందజేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి పాలంకి నాగరాజు, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్స్, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు టి.జయకృష్ణ పాల్గొన్నారు.



బదిలీ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న జేసీ రాహుల్ మీనా

వంగవీటి మోహనరంగా విగ్రహం ధ్వంసం

- పిఠాపురం–ఉప్పాడ రోడ్డులో భైఠాయించిన అభిమానులు
- ముద్దాయిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

కొత్తపల్లి: స్థానిక ఊర చెరువు సెంటర్‌లో ఉన్న దివంగత వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు గురువారం ధ్వంసం చేశారు. దీంతో మోహనరంగా అభిమానులు పిఠాపురం– ఉప్పాడ రోడ్డులో ఊరచెరువు సెంటర్‌లో భైఠాయించి ఆందోళన నిర్వహించారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పోలీస్ స్టేషన్ వద్ద కూడా భైఠాయించి ఆందోళన నిర్వహించారు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఘటనా స్థలానికి ఎస్సై వెంకటేష్ చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. అభిమానులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పూర్తి స్థాయిలో దర్యాప్తు చేశామని ఎస్ తెలిపారు. గురువారం తెల్లవారు జామున కొత్తపల్లి ఎస్సీ పేటకు చెందిన పెట్టా శ్రీకాంత్ విగ్రహాన్ని ధ్వంసం చేసినట్లు గుర్తించామన్నారు. విగ్రహానికి సంబంధించి చేతులను విరగ్గొట్టి పక్కనే ఉన్న చెరువులో పడవేశాడు. పలువురు సాక్షుల చెప్పిన సమాచారం ఆధారంగా శ్రీకాంత్‌పై కేసు నమెదు చేసి అరెస్ట్ చేశామన్నారు.



పిఠాపురం- ఉప్పాడ రోడ్డులో భైఠాయించి ఆందోళన చేస్తున్న మోహనరంగా అభిమానులు